"కథాంజలి" గత నాల్గు దశాబ్దాలనుంచి నిరాఘాటంగా ప్రచురణ సాగుతున్నది.

♦ ♦ ♦

శ్రీ. బి. ఎన్. రెడ్డిగారు ఎప్పుడు కనపడినా "కథాంజలి" గురించే సంతోషాన్ని తెలిపే వారు. గత రెండు నెలలవెనుకకూడా టి. నగర్ ఆంధ్రాబ్యాంకులో వారిని కలుసుకున్నాను. దాదాపు పదైదు నిమిషాలు మాట్లాడుకున్నాం. ఆరోజుకూడా "కథాంజలి" ఇంకా స్వర్ణోత్సవం, వజ్రోత్సవం చేసుకోవాలని ఆశీర్వదించారు. అదేవారి ఆఖరు ఆశీర్వచనం - అదేవారి ఆఖరు దర్శనమైపోయింది.

♦ ♦ ♦

శ్రీ బి. ఎన్. రెడ్డిగారికీ - నాకూ 40 సంవత్సరాల భంధం. ఈ భంధంలో వారిని తలచుకుంటెనే ఎంతో బాధ పడుతాను. ఇక రక్త సంభంధంవున్న శ్రీ బి. నాగిరెడ్డిగారు, శ్రీ కొండారెడ్డిగారు, శ్రీ రామలింగా రెడ్డిగారు, వీరి శోకం వివరించ లసాధ్యం. అయినా శ్రీ బి. ఎన్. రెడ్డిగారు వదిలివెళ్ళిన బృహత్తర కృషిని అనుసరిస్తూ వారి ఆత్మకు శాంతి కలుగ చేయడమే ప్రస్తుతం వారి సహోదరుల కర్తవ్యం.

శ్రీ బి. ఎన్. రెడ్డిగారి ఆత్మకు శాంతి కలిగించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

ఎ. ఎన్. రాఘవాచారి,
సంపాదకుడు.

**కథాంజలి**
[చక్కని కథల మాస పత్రిక]
స్థాపితం 1938.
విడి ప్రతి ... 40 పైసలు
సంవత్సర చందా ... రూ. 7-50.
(రెండు ప్రత్యేక సంచికలతో సహా)
నేడే చందాదారలుగా చేరండి.
అన్ని హిగ్గిన్ బాథమ్స్ బుక్ స్టాల్సులో దొరుకును.

# రొట్టె ముక్క!

రచన :
శ్రీ యల్. రాజాగణేష్.

"వూ......హ్......" అది నిట్టూర్పో, బాధగా ఆక్రోశించడమో తెలీదు. మాసిన మాసికల బట్టల్తో, అరంగుళం మందాన ఎదిగిన గెడ్డంతో, సన్నగా, నల్లగా, బక్కచిక్కిపొడుగ్గా ఉన్న అతని వాలకం నడవలేక నడుస్తుంది. అతడొక బిచ్చగాడు. ఏడ్సేకళ్ళు పెదిమల్లో ప్రతిధ్వనించే నిరుపేదవాడు. ఎముకల గూడులా ఉన్న అతణ్ణొక్కసారి చూస్తేచాలు దారిద్రం ఇంత దుర్భరమా అనిపిస్తుంది. సంఘంలో అతడొక అట్టడుగు తరగతి మనిషని ఇట్టేతెలిపోతుంది, అతని పేరు అప్పన్న.

ఇలా ఎందరో, ఎందరెందరో దీనులు, ఆర్తులు, శాపగ్రస్తులు ఇదేదారంట నడిచిపోతూనే ఉన్నారు. పరితపిస్తూ నశించిపోతూనే ఉన్నారు. ఏవిటీ తపన? ఇంతేనా జీవితపు పరిధులు? వీటికి అంతంలేదా?

కథ ఇంతవరకూ వ్రాసిన రామంద్రానికి దగ్గు తెరలు తెరలుగా ముంచుకొచ్చింది. కళ్ళు కళ్ళుమని దగ్గాడు, దగ్గుతూనే ఉన్నాడు. ఇంకా ఇంకా దగ్గుతూ కళ్ళి కక్కుతూనే ఉన్నాడు, దగ్గిదగ్గి ఇకదగ్గలేక ఆయాసంతో, నీరసంతో బాధ పడ్తూనే ఉన్నాడు.

♦ ♦ ♦

ఓ ప్రయివేటు కంపెనీలో గుమాస్తాగా పనిచేస్తున్న రామచంద్రం నిజానికి మంచి కథారచయితల్లో ఒకడని కూడా చెప్పాలి. అతని కథలన్నీ సమాజంలో అట్టడుగు తరగతి మనుషుల్ని గురించే! ఒక విధంగా చెప్పాలంటే అతనుకూడా అట్టడుగు తరగతి మనిష నే చెప్పాలి. రెండు విధాలుగా సంపాదిస్తున్నాడన్న మాటే కాని, గంపెడు సంసారంతో, బండెడు సమస్యల్తో చాలీ చాలని తనంతోనే జీవిస్తున్నాడతనుకూడా.

పైగా అతనికీ మధ్య దగ్గు ఎక్కువై జ్వరం కూడా

వస్తుండడంతో, డాక్టరు క్షయని చెప్పాడు. మంచి ఆహారం, మంచిగాలీ, మంచిమంచి మందులూ అత్యవసరమని మరీమరీ చెప్పాడు. అందుచే అతనీ మధ్య పరిమితి మించి కథలు వ్రాస్తున్నాడు. ఆత్మరక్షణకోసం ప్రాకులాడుతున్నాడు.

దగ్గుతగ్గాక మళ్ళీ కథ వ్రాయనారంభించాడు రామచంద్రం.

"బా...బో..." వీధిలోంచి బిచ్చగాడెవడో అరిచాడు.

"అలా వెళ్ళు..." ముంచుకురాబోతున్న దగ్గాపుకుంటూ చెప్పాడు తను. కానీ అతని మాటలు వినబడనట్టే—

"బాబో... ధరమ పెబువులు... పిడికెడు బిచ్చం పెట్టిచ్చండి బాబో......" మళ్ళీ అదే పిలుపు, అదే అరుపు, అదే స్వరం.

"ఉహ్...అలా వెళ్ళరా!" విసుగ్గా స్వరం హెచ్చించి చెప్పాడీసారి తను.

"ఆకలేస్తోంది కసింత సద్దిగంజైనా పోయించండి బాబో..." మళ్ళీఅదే దీనాలాపన! అదే అభ్యర్థన!! అంతే!!!

"లేదురా బాబూ! లేదూ లేదూ ఏదీలేదు" లోలోపలే గొణుక్కున్నాడతను. పైకి మాత్రం– వేళాపాళాలేదు, వెధవగోలని వెధవగోల అని బాహాటంగా విసుక్కున్నాడు.

అయినా ఆకలికి వేళేమిటి?

ఎలా చెప్పి పొమ్మంటే పోతాడో, రామచంద్రానికి అర్థంకాక క్షణంసేపు మౌనంగా ఉండిపోయాడు. ఇదే అదననుకున్నాడో, ఏమో–

"గొప్పోళ్ళా పెట్టకపోయి, మీ బోటోళ్ళా పెట్టకపోయి మేం ఏంకావాలి బాబో? రెండ్రోజుల్నుంచి తిండి లేదు. పోనీ ఓ పదిపైసలైనా ఇప్పిచ్చండి ఏదో రొట్టెముక్క కొనుక్కుంటా బాబో బాబో......తన ధోరణిలో తాను చెప్పుకుపోయాడు బిచ్చగాడు.

"పోతావా? పోవా? ఆట్టేవాగావంటే మెడపట్టుకు గెంటుతా అం!" కోపంతో అసహనంగా, విసుగ్గా అరుస్తూ ద్వారబంధం దగ్గరికి వచ్చాడతను.

దీనాతిదీనంగా ఉన్న బిచ్చగాణ్ణిచూశాక రామచంద్రం కోపం విరిగిపోయింది. అంతే అలా చూస్తూ ఉండిపోయాడు రామచంద్రం......అచ్చంతను వ్రాయబోతున్న కథలో మనిషిలాంటోడే! లాంటోడేమిటి? తన కథానాయకుడు అప్పడే! ముమ్మూర్తులా వాడేవీడంటే సందేహ మేమీలేదు. లోతుకుపోయిన కళ్ళూ, పొడుగాటి బరుగుశరీరం, అంగుళం మందాన ఎదిగి నెరిసిన గడ్డం, నున్నని బట్టతలా, ఏదో పాపఫలం అనుభవిస్తున్న అస్థి

LPC



ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజి డీప్ వెల్

- జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెషర్‌లో సాదారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుంచి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.

½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

———————— : వివరములకు : ————————

Grams : "NAIDUBROS" Phone : Office : 22409 Works ; 22757

THE EL-P-EM INDUSTRIALS

393, Mettupalayam Road (P.B. No. 1053) COIMBATORE-641002

పంజరంలాంటి అప్పుడే బిచ్చగాడు సందేహమేమీ లేదు.

రామచంద్రాన్ని చూసిన బిచ్చగాడు మరేదో అన బోయాడు కానీ దగ్గు తెరలుగా ముంచుకు వచ్చి అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. "క్......క్......క్......" ఒకటే దగ్గు చివరికి-'అబ్బా! థూ!!' బలంగా ఉమ్మాడు వాడు, ఎరుపు నలుపు వర్ణాలతో దోసెడు రక్తం నేల మీద పడింది.

ఆ స్థితిలో బిచ్చగాణ్ణి చూసిన రామచంద్రానికి సర్వావయవాలూ ఒక్కసారిగా జలదరించాయి. మనసంతా చేదువిషమై పోయింది నిలువు నా నీరైపోయి-'ఇలాంటి సంఘటనలన్నీ నాకళ్ళ ముందే పడ్తాయేం?' తన్నుతానే ప్రశ్నించుకుని బరువుగా కళ్ళు మూసేసుకున్నాడు.

"ఆకలేస్తాందని సెప్పుకుంటుంటే ఏటి బాబో అలాగ సిరేస్తారూ? పైగా గెంటేత్తానంటారూ? బిచ్చవో, డబ్బులో ఉంటే ఏస్తారూ? లేదా లేదు. లేకపోతే పోనీ దయగా ఒక్క రవ్వ మాటయినా సెప్పొచ్చుగదా అదేటి బాబో మీరు గెంటెయ్యడం దేనికి నేనే పోతాను బాబో నేనే పోతాను. నేనేపోతాను..." అని నిస్సత్తువగా కదిలాడు బిచ్చగాడు.

క్షణం క్రితం రామచంద్రం నరనరాల్లో కోపాన్ని బిచ్చగాడి మాటలు గేలిచేశాయి. సిగ్గుతో తలపూర్తిగా వాల్చేసుకున్నాడు రామచంద్రం. అంతలోనే మళ్ళీ ఏదో జ్ఞాపకం వచ్చినట్టు బిచ్చగాడివేపు చూసాడు. 'ఇదిగో ఏయ్...నిన్నే...!...' బిచ్చగాణ్ణి ఎంతో ప్రేమగా పిలవాలనుకున్నాడు కానీ ముఖం చెల్లలేదు నోరుపెగల్లేదు అంతలోనే రామచంద్రాని కెందుకో పరుగెత్తుకెళ్ళి, బిచ్చగాడి కాళ్ళమైపడి - "విసుగుతో, కోపంతో, నేనన్నమాటలన్నీ క్షమించు క్షమించు క్షమించవూ?" అనడగాలనిపించింది, కానీ అతను మెదల్లేదు. కాలు కదపలేదు రాయిలా అచేతనంగా ఉండిపోయాడు.

చివరికి వ్యక్తంకాని స్థితిలో హృదయంలోంచి ఉప్పొంగుతున్న బాధను దిగమింగుతూ ఇంట్లోకి నడిచాడు రామచంద్రం.

ఇంట్లో...పస్తులు...ఆకలి ... అవసరాలు...అప్పులు ఆక్రందనలు...నిట్టూర్పులు...ఏమీ చెయ్యలేని వాజమ్మతను మొండి చేత్తోనే మళ్ళీబయటికి వచ్చి, దూరమైపోతున్న బిచ్చగాడి వైపు చూస్తూ నిలిచిపోయాడు, గంభీరమైన అతనికన్నుల్లో గిర్రున నీరుతిరిగింది.

"నీలాంటి వాళ్ళమీద కథలు రాయడం, కవితల్లడం తప్పనీరాత మార్చేశక్తినాకులేదు బాబూ! లేదు!! అంతెందుకు? నారాతనే నేను మార్చుకోలేను నాసమస్యల్నే నేను పరిష్కరించుకోలేను. పోనీ...నీ బోట్లోళ్ళని ఆదుకునే శక్తినాకుందా? అదసలేలేదు! నిజం బాబూ! నన్నునమ్ము!! నన్ను క్షమించు మళ్ళీమళ్ళీ ఈఛాయలకురాకు వచ్చినా విసిగించకు కోపం అసహనం విసుగూ పోగొట్టుకోవాలన్నా పోగొట్టుకోలేని అశక్తుణ్ణి నేను. దౌర్భాగ్యుణ్ణి నేను వాటికతీతంగా ఉండాలన్నా పరిస్థితులలా ఉండనియ్యవు మరి వెళ్ళు బాబూ! వెళ్ళు! వెళ్ళు! వెళ్ళిపో!" రామచంద్రం గుండెలు గొణిగాయి.

సమసల్లా-సందె వెలుగులంతరించి, చిమ్మ చీకట్లు కమ్ముకుంటున్నాయ్! బిచ్చగాడు చీకట్లోకి పయనిస్తున్నాడు రామచంద్రం చీకట్లోనే నిలిచిపోయాడు. ఆ విధిచివర వెలగలేక వెలుగుతున్న వీధిదీపం కింద ఎంగిలి మెతుకులకోసం, రొట్టె ముక్కలకోసం, మాంసం ముక్కలకోసం, కుక్కలు కుమ్ములాడుకుంటున్నాయ్! వాటిని తగిలి మూగిన మనుష్యులు కుక్కల్ని మించిపోయి పోట్లాడుకుంటున్నారు! జేబుల్నిండా డబ్బుతో, మోయలేని శరీరపు బరువులో, త్రేనుస్తూ ఆవేపు కనీసం చూడనైనా చూడకుండా రిక్షాలో కూలబడి వారివారి గమ్యాలకు చేరుకుంటున్నారు. డబ్బుగల పెద్దలు అజీర్తితో అల్లాడిపోతున్నారు. మరికొందరు ఇది మన కర్మే! దీనికిముగింపులేదు. ఇది భారతదేశం హోటల్ ముందర వీధిలో రామచంద్రం ఇంటిదగ్గర సంఘటన కాలమానం ఆకలిమానం చాలీచాలని రొట్టెముక్కలే కథా వస్తువులు.

★

దేవుడున్నాడా - లేడా? అన్నది నమ్మకంపై ఆధారపడి ఉంటుంది. ఈమె నాతల్లి అని చెప్పగలం; ఇతడు నా తండ్రి అనిగాని దేవుడు ఈ రూపంలో ఉంటాడనిగాని చెప్పేంతవరకే - నిరూపించడం చాలా కష్టం!

నాకు నేను సమర్థించుకోనేది మనిషిపని - తాను ఇతరులను సమర్థించుకోనేది మనసు పని!